బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ

అయ్యప్ప సొసైటీలో బస్తీ దవాఖానాలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కే. సుధాకర్

మాదాపూర్, మార్చి 20: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని బస్తీ దవాఖానను గురువారం శేరిలింగంపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం దవాఖానలో రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన సదస్సు

దుండిగల్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌నీ వైద్యాధికారి స్వర్ణలత

దుండిగల్, మార్చి 20: క్షయ(టీబీ)పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌నీ) వైద్యురాలు డాక్టర్ స్వర్ణలత అన్నారు. దుండిగల్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు గురువారం క్షయపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ.. క్షయ ఒకరి నుంచి ఒకరు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎక్కువగా పౌష్టికార లోపంతోనే క్షయ వ్యాధి వస్తుందని, విద్యార్థులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిరాజుద్దీన్, సూపర్వైజర్లు రమేశ్, చంద్రకళ, లతీఫ్, క్షయ విభాగ ఉద్యోగులు కిశోర్, శ్రవణ్, రవీందర్‌తోపాటు పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిచ్చుకలతో పర్యావరణ సమతుల్యం

- బోటానికల్ గార్డెన్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

బోటానికల్ గార్డెన్‌లో పిచ్చుక గూళ్లను తయారు చేసి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి, మార్చి 20: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్త గూడ బోటానికల్ గార్డెన్‌లో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. పిచ్చుకలు చిన్నవే కానీ ముఖ్యమైనవని, ఇవి పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. పిచ్చుకలు వివిధ కీటకాలను తినడం ద్వారా వాటి జనాభాను నియంత్రించడంలో సహాయపడతాయని, విత్తనాల వ్యాప్తిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పిచ్చుకల ఉనికి జీవవైవిధ్యాన్ని పెంచుతుందన్నారు. గ్రామీణ, పట్టణ పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యానికి కీలకమైనవిగా పేర్కొన్నారు. అనంతరం వేసవి మొదలవడంతో పక్షుల దాహం తీర్చడం కోసం మట్టి పాత్రల్లో నీటిని నింపి బోటానికల్ గార్డెన్‌లోని వివిధ చెట్ల కింద ఉంచారు. కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, డాక్టర్ వీరకిశోర్, హెడ్ నేచురలిస్ట్ అఖిల్, నేచురలిస్ట్ అపరంజని, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి,డీఆర్ఓలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతి,శాంతన్‌రాజు,వాకర్స్ పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌తో ఇక్కట్లు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 20: కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ ప్రధాన మార్గంలో.. రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ చౌరస్తాలో టీ స్టాల్, టిఫిన్‌సెంటర్ ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కాలనీలోకి వచ్చే పాఠశాల బస్సులు రావాలంటే ఇబ్బందిగా ఉన్నది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు రోడ్డును పరిశీలించి.. పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో స్పోర్ట్స్ డే

- ఘనంగా మర్రి లక్ష్మణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మర్రి లక్ష్మణ్‌రెడ్డితో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

దుండిగల్, మార్చి 20: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ)కళాశాలలో గురువారం ఎంఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్, వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి 81 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు లక్ష్మణ్‌రెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన జన్మదినోత్సవాన్ని కళాశాలలో స్పోర్ట్స్ డేగా జరుపుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతీ ఏటా రూ.1.5 కోట్లను క్రీడా కోటా స్కాలర్‌షిప్‌గా అందిస్తున్నామని వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ ఐటీ కోశాధికారి మర్రి మమతా రెడ్డి, డైరెక్టర్లు శ్రేయారెడ్డి,మర్రి ధీరన్‌రెడ్డి, అరుంధతి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

అదనపు ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలి

కమిషనర్ సాబేర్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి 20: నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో విధించిన అదనపు పన్ను సమస్యను పరిష్కరించాలని 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి కోరారు. అదనపు ఇంటి పన్ను విధింపుతో డివిజన్‌లోని మధ్యతరగతి ప్రజలు పన్ను చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ కార్పొరేటర్ గురువారం ప్రజలతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటి పన్ను సమస్య పై ఇదివరకే కలెక్టర్‌తో చర్చించామని వచ్చే నెలలోగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్‌లో చలివేంద్రాల ఏర్పాటు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 20: జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీలో విద్యార్థుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యార్థి సంఘం నేతలు రాహుల్‌నాయక్, దుర్గా ప్రసాద్ తెలిపారు. గురువారం జేఎన్టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో వర్సిటీ ప్రధాన ద్వారం, స్పందన బ్లాక్‌ల వద్ద చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో దాహం తక్షణమే తీర్చుకునేందుకు చలివేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. యూనివర్సిటీలో తాగునీటి ప్లాంట్లను మరమ్మతులు చేయించి ప్రతి బిల్డింగ్‌లో.. ప్రతి ఫ్లోర్‌లో తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సాగర్‌నాయక్, నితిన్‌కుమార్, సంతోష్‌కుమార్, భానుప్రకాశ్, హరినాథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను సుందరీకరిస్తాం...: కార్పొరేటర్

మియాపూర్ మార్చి 20: గురునాథం చెరువు తరహాలో డివిజన్ పరిధిలోని చెరువులన్నింటినీ సుందరీకరిస్తామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఎమ్మెల్యే తోడ్పాటుతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సుందరమైన తటాకాలుగా తీర్చిదిద్దుతామన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం, పటేల్ కుంట, పెద్దకుడి, రామసముద్రం,నాయనమ్మ కుంటలను మల్లెగ వాడ్ సంస్థ ప్రతినిధులు ఆనంద్ మల్లిగ వాడ్‌తో కలిసి గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లోకి మురుగునీరు రాకుండా పూర్తి స్థాయిలో నిలువరించి, పరిశుభ్రమైన వర్షపు నీటితో కళకళలాడేలా తీర్చి దిద్దుతామన్నారు. కాంక్రీట్‌కు భిన్నంగా సహజమైన మట్టిని వినియోగించి పనులను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. విలువైన చెరువు స్థలాలు కబ్జాకు గురికాకుండా పటిష్టమైన బండ్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామ్ చైతన్య పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపులేవి?

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ల బాలపీరు

దుండిగల్, మార్చి20: బడ్జెట్లో ఎస్సీల అభివృద్ధి కోసం కాగితాలపై అంకెలు పెంచిన ప్రభుత్వం ఖర్చులు తుంచుతున్నదని మేడ్చల్ జిల్లా కేవీపీఎస్ కార్యదర్శి నాగనిగళ్ళ బాలపీరు అన్నారు. దళితుల జనాభా ధామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు గురువారం విలేకరులతో మాట్లాడారు. చేవెళ్ల డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని, అదేవిధంగా అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లను కేటాయిస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోలేకపోయిందన్నారు. రాష్ట్రంలో సుమారు 18 శాతం ఉన్న దళితులకు ప్రతి ఏటా బడ్జెట్లో అంకెలు పెంచుతూ ఖర్చులు మాత్రం తుంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 64 లక్షల జనాభా కలిగిన దళితులకు కనీస అవసరాలు తీర్చేల బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ గ్రూపులుగా విడగొట్టిన ప్రభుత్వం, పెరిగిన దళిత జనాభా దామాషా ప్రకారంగా రిజర్వేషన్లు పెంచలేదన్నారు.

టీవీ నటులకు సీల్‌వెల్ అవార్డులు ప్రదానం

ముషీరాబాద్, మార్చి 20: అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సిల్‌వెల్ టీవీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఏపీ అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు విజయ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని బుల్లితెర నటులకు అభినందన, సీల్‌వెల్ టీవీ అవార్డులు ప్రదానం చేశారు. టీవీనటులు రాధాకృష్ణ, సింధుజ, సౌందర్య రెడ్డి, జయశ్రీ, ప్రీతి శర్మ, కిరణ్మయి, విజయ, సంజయ్‌భార్గవ్, పృథ్వీరాజ్, మనోజ్, కృష్ణ తేజ, చైత్రిక రెడ్డిలు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో బండారు సుబ్బారావు, నటుడు ప్రదీప్, సంజయ్ కిశోర్, అభినందన సంస్కృతి సంస్థ అధ్యక్షురాలు వసుంధర దేవి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఈ భవానీ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మిసెస్ ఇండియా బ్యూటీ పేజెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సమన హుసేని తదితరులు

శేరిలింగంపల్లి, మార్చి 20; ఇండియా టీన్స్ ఫ్యాషన్ లీగ్(ITFL), మిసెస్ ఇండియా బ్యూటీ పేజెంట్-2025 పేరుతో దేశంలో మొదటిసారిగా మాతృమూర్తులు, పిల్లలతో కలిసి ఫ్యాషన్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు విబ్బర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ప్రతినిధి సుచరిత పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ చైర్మన్ సమన హుసేనితో కలిసి ఆమె బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటిసారిగా మాతృమూర్తులు వారి పిల్లలతో ఒకే వేదికపై గ్లామర్, కుటుంబ బంధాలు, సాధికారితను పటిష్ట పరచడానికి దోహదపడే వినూత్న అంశాలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మనూ విశ్వవిద్యాలయ ప్రతినిధి సుచరిత, మనోజ్ పట్వర్ధన్, అభిషేక్ అగర్వాల్,ప్రీతి అగర్వాల్, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

పార్క్ విల్లా కాలనీవాసుల సంక్షేమమే ధ్యేయం

పార్కు విల్లా కాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ నరసింహయాదవ్

బాలానగర్, మార్చి 20 : పార్క్ విల్లా కాలనీవాసుల సంక్షేమమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట పార్క్ విల్లా కాలనీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ సమస్యలు, విద్యుత్ సరఫరాను సింగల్ ఫేజ్ నుంచి త్రీఫేస్‌కు మార్చాలని, శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, జలమండలి తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఎలక్ట్రికల్ పార్లమెంట్ సాంబశివరావు,ఎలక్ట్రికల్ కృష్ణ, ఓం ప్రకాశ్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్, నాయకులు ధనుంజయ, చంద్రకాంత్, కుబేర్, అక్బర్, రాము, సురేశ్, ముఖేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

కేక్ కట్ చేస్తున్న ప్రతినిధులు

మియాపూర్ మార్చి 20: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా స్థిరపడాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఉట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మహిళా గ్రూప్ సభ్యుల సమక్షంలో వీరాంజనేయ శివాలయ ఆవరణలోని కమిటీ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలను శాలువాతో సత్కరించారు. మహిళలు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. ఇంద్రసేన, సీఓ సుజాత టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మంజుల, పద్మావతి, పాపిరెడ్డినగర్ ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు శోభరాణి, వెంకట లక్ష్మి, సౌజన్య, భగవంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆర్సీ రాణి, కవిత, శ్వేతగుప్తా, మహిళా గ్రూప్ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పల్,నారపల్లి ఫ్లైఓవర్‌ను త్వరగా పూర్తి చేయాలి

పోచారం,మార్చి 20:ఉప్పల్-పోచారం మున్సిపాలిటీ నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుక రావాలని సీపీఎం డిమాండ్ చేసింది.ఈమేరకు ఈనెల 22న నారపల్లి నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు వరకు వాహనదారులతో కలిసి పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు చింతల యాదయ్య,ఎన్.సబిత తెలిపారు. పాదయాత్రను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లీ పాల్గొని ప్రారంభిస్తారని అన్నారు. వాహన దారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మాదాపూర్ : ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

మాదాపూర్/కొండాపూర్, మార్చి 20: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చందానగర్ కూడా ఫేజ్-2 షిర్డీసాయి బాబా ఆలయ ఆవరణలో మెడికవర్ చందానగర్ హాస్పిటల్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసో సియేషన్ కన్వీనర్ టీ. రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. 100మందికి ఎత్తు,బరువు,పల్స్, ఈసీజీ,బీపీ పరీక్షల నిర్వహించారు. మెడికవర్ దవాఖాన జనరల్ ఫిజీషియన్ ఆదిత్య, డెంటల్ వైద్యనిపుణుడు తేజ, విజన్ ఐ కేర్ వైద్యుడు నజీర్ తదితరులు వైద్య సేవలందించారు. ఆలయ కమిటీ సభ్యులు (శ్రీనివాసరావు, రామిరెడ్డి, రాజయ్య, సిద్ధిరాములు,శ్రీనివాసనాయక్, కిశోర్ బాబు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్,శివరామిరెడ్డి, బాలరాజు, దవాఖానప్రతినిధి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మృతుడు రాజు (ఫైల్)

శేరిలింగంపల్లి, మార్చి 20: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మసీద్‌బండ కొండాపూర్ అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన పెండ్యాల రాజు(35) కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య లవని, ఇద్దరు కుమారులున్నారు. అయితే కొంతకాలంగా రాజు మద్యానికి బానిసై కూలి పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం భార్య లవని ఇద్దరు కుమారులను తీసుకొని పటాన్‌చెరువు చిట్కుల్‌లోని పుట్టింటికి వెళ్లింది. కాగా ఇంటి వద్ద ఉన్న రాజును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి ఇంటి అరుగుపై కూర్చోబెట్టి వెళ్ళాడు. తెల్లవారుజామున విగతజీవిగా పడిఉన్న రాజును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకి తరలించారు. మృతుడి మేనల్లుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఒంటి పై స్వల్ప గాయాలున్నాయని, సహజంగా చనిపోయాడా ? లేక ఎవరైనా చంపారా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మార్చి20: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ తాము ఉంటున్న భవనం 5వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాశ్‌నగర్ పైప్‌లైన్ మార్గంలో హంసబర్గ్ అపార్ట్‌మెంట్‌లో ఏపీ రావులపల్లి ప్రాంతానికి చెందిన శ్రీనివాస్,శాంతకుమారి దంపతులు పిల్లలతో కలిసి గత కొన్నేళ్ల కిందట నగరానికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. అయితే శాంతకుమారి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. గురువారం రాత్రి తాము ఉంటున్న భవనం 5వ అంతస్తు పైనుంచి కింద దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



సైబర్ నేరాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ విజయ్‌వర్ధన్

కుత్బుల్లాపూర్, మార్చి 20: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేట్ బషీరాబాద్ సీఐ విజయ్ వర్ధన్ అన్నారు. ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో 20 రకాల సైబర్,ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రూపొందించిన బుక్‌లెట్‌ను గురువారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌వర్ధన్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎవరైనా వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోరాదని అన్నారు. కార్యక్రమంలో 'ఆదర్శ' బ్యాంకు ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జీడిమెట్ల స్టేషన్‌లో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ గడ్డం మల్లేశ్ తదితరులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ

జీడిమెట్ల : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ అన్నారు. గురువారం ది ఆదర్శ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన 'సైబర్, ఆర్థిక నేరగాళ్ల మోసాల తీరు' అనే పుస్తకాన్ని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆవిష్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 'ఆదర్శ' బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్‌వీ రమణ, షాపూర్ నగర్ మేనేజర్ యాదగిరి, బోయినపల్లి బ్రాంచ్ అధికారి వెంకటేశం, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శివకుమార్ దంపతులకు చెక్కును అందజేస్తున్న గౌసుద్దీన్, మల్లేశం

అల్లాపూర్, మార్చి 20 : అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త కుమారుడికి మేడ్చల్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ చేయూతనందించారు. అల్లాపూర్ డివిజన్ పరిధి రాణాప్రతాప్ నగర్ చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శివ కుమార్ 10 నెలల బాబు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న గౌసుద్దీన్ దాతలు గండె మల్లేశం, బైరపల్లి సహకారంతో లక్ష రూపాయలను సమకూర్చారు. అనంతరం శివకుమార్ దంపతులకు వారి నివాసంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్, హమీద్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 20 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు(కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 23, కాకరకాయ 38, బీర కాయ 38, క్యాబేజి 10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 16, కాలీఫ్లవర్ 18, దొండ 35, చిక్కుడు 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 37, ఆలుగడ్డ 25, కీర 15, దోసకాయ 20, సొరకాయ 15, పొట్లకాయ (1) 20, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, చింతకాయ, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని బీసీఏ రీవాల్యుయేషన్ ఫలితాలతోపాటు ఎంఫార్మసీ(పీసీఐ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలన్నారు.

'రీవాల్యూయేషన్'కు దరఖాస్తులు

ఓయూ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 25లోగా టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తప్పిపోయిన చిన్నారులు.. తల్లిదండ్రులకు అప్పగింత

తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కేపీహెచ్‌బీ కాలనీ సీఐ రాజశేఖర్‌రెడ్డి

కేప